


తవ్వినాకొద్దీ మైనింగ్ అధికారుల అక్రమాలు


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

ఆదివారం | 15 జూన్ , 2025 | పేజీలు : 06




## పెండింగ్ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దీర్ఘకాలికంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని మిర్యాలగూడ ఐదవ అదనపు జిలాల జడ్జి జి.వేణు అన్నారు. శనివారం స్థానిక కోర్టు సముదాయంలో జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రాంరభించి మాట్లాడారు. ఆర్థిక, మానసిక, వ్యయ ప్రయాసలు తగ్గించుకునేందుకు ఇరుపక్షాలు రాజీ పడి కేసులను పరిష్కరించుకోవాలన్నారు. లోక్‌అదాలతోలో పరిష్కారం అనంతరం ఏ కోర్టుకు వెళ్లే అవకాశం లేదని, ఇదే తుది తీర్పని అన్నారు. కేసుల్లో ఉన్న ప్రజలు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రశాంతంగా జీవనం గడపాలని కోరారు. అనంతరం అదనపు జిల్లా జడ్జి కోర్టులో న్యాయమూర్తి వేణు, సబ్‌కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి సుజయ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్‌లు లోక్‌అదాలత్ నిర్వహించి 214 సివిల్, క్రిమినల్, పీఎల్పీ, బ్యాంకు కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, భూపతిరెడ్డి, ఏపీపీ సుధాకర్, న్యాయవాదులు రాంబాబు, ఎండి.ఇబ్రహీం, కొంక వెంకన్న, ఆర్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ ప్రవేశాలకు గోడ ప్రతిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల,చర్లపల్లి, నల్లగొండ కళాశాల యందు 2025/26 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం కావడం జరిగింది. ఇందుకు సంబంధించిన గోడ ప్రతిని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆవిష్కరించారు. అర్హులైన మహిళా విద్యార్థులు జూన్ 23 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న కోర్సులు బిఎస్‌సి (బిజెడ్సి,ఎంజెడ్సి, ఎంపీసీ,ఎంపీసీఎస్, ఎంఎస్సీఎస్, ఏంఎస్డిఎస్), బికాం (బిఏ, సీఏ), బిఏ(హెచ్ఈపి).దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పదవతరగతి, ఇంటర్మీడియట్ మార్కుల మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ,5 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో పాటుగా జనవరి 2025 తర్వాత పొందిన తాజా ఆదాయ ధృవీకరణ పత్రంతో ఈ దరఖాస్తులను జత చేసి నేరుగా జూన్ 23 లోపు కళాశాలలో అందజేయాలని కలెక్టర్ తెలిపారు. గోడ ప్రతి ఆవిష్కరణలో హౌసింగ్‌ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్ కుమార్,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పవిత్ర వాణికర్ష, కళాశాల అడ్మిషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### రైతు నేస్తంను వీక్షించేందుకు ఏర్పాట్లు చేయాలి

ఆధునిక పంటల సాగు, పంటల యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతికత ద్వారా వ్యవసాయ సాగు, తదితర అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు ఎప్పటికప్పుడు అందించే సూచనలు, సలహాలు ,రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు ,అభివృద్ధి కార్యక్రమాలపై రైతులకు తెలియజేసేందుకు గాను ఈనెల 16 న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రొఫసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని జిల్లాలోని రైతులందరూ వీక్షించి సద్వినియోగం చేసుకునే విధంగా రైతు వేదికలలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



## 500 గ్రాముల గంజాయి పట్టివేత

### ఐదుగురు నిందితులు అరెస్టు

**ప్రజాపక్షం/ సూర్యాపేట:** ఐదుగురు వ్యక్తుల నుంచి 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపిన సంఘటన జిల్లా లోని పెన్ పహాడ్ మండలంలో జరిగింది. డిఎస్పి ప్రసన్నకుమార్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. శనివారం ఉదయం 9 గంటల సమయంలో అనంతారం క్రాస్ రోడ్డు వద్ద పెన్ పహాడ్ ఎస్ఐ గోపికృష్ణ తన పోలీసు సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఐదు బైకులపై ఐదుగురు వ్యక్తులు అతివేగంగా అనుమానాస్పదంగా దురాజ్ పల్లి వైపు వెళ్తున్నారు. ఎస్ఐ గోపికృష్ణ తన పోలీస్ సిబ్బందితో వారిని వెంటాడి చాలా చాకచక్యం తో వారిని పట్టుకున్నారు. దొరికినవారు పెన్ పహాడ్ మండలం మాచారం గ్రామానికి చెందిన బొమ్మ కంటి గోపి. పేరం శ్రీకాంత్. పేరం శివ. పెన్ పహాడ్ కు చెందిన ఇంద్రవెల్లి జీవన్ కుమార్. నారాయణ గూడెం గ్రామానికి చెందిన పర్సనబోయిన రమేష్‌లు ఉన్నారు. ప్రతి వ్యక్తి దగ్గర 100 గ్రాముల గంజాయి లభించింది. వెంటనే వారిని అరెస్ట్ చేసి 500 గ్రాముల గంజాయిని. 5. బైకులు. 3. సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకొని విచారించడం జరిగింది. బొమ్మ కంటి గోపి. పేరం శ్రీకాంత్ లు గత కొన్ని నెలల క్రితం ఒరిస్సాకు వెళ్లగా ఆ ఒరిస్సా సరిహద్దుల్లో గుర్తుతెలియని వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా కొనుగోలు చేసుకుని దాచుకున్నట్లు వారు తెలిపినట్లు వారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ గోపి కృష్ణను పోలీసు సిబ్బందిని డి ఎస్ పి ప్రసన్న కుమార్ అభినందించాడు. ఈ సమావేశంలో సూర్యాపేట రూరల్ సిఐ జి రాజశేఖర్ ఎస్ ఐ గోపికృష్ణ, కానిస్టేబుల్స్ ప్రవీణ్ మహేష్ వంశీ సైదులు రమేష్ లింగరాజు పాల్గొన్నారు.


## జోస మెదటి రౌండ్‌లో గౌతమి విద్యార్థులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జోస ప్రకటించిన జోస మెదటి రౌండ్‌లలో గౌతమి జూనియర్ కళాశాలకు చెందిన ఆర్ శ్రీకర్ ఐఐటీ దంబాద్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 5. ఐఐటీ కంచెపురం ఇసిఇ 2. నీట్ అగర్తలలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో సీట్ సాధించారని తెలియచేస్తూ గౌతమి కళాశాల యాజమాన్యం కాసర్ల వెంకట్ రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమ్మిడి రఘుపాల్ రెడ్డి, పుట్ట వెంకటరమణా రెడ్డి లు విద్యార్థులకు అభినందనలు తెలియచేశారు.



## రోడ్డు పక్కనే వ్యర్థాలు..ఎన్నో అనర్థాలు..

### దుర్గంధంతో ఇబ్బందులు



**ప్రజాపక్షం/నందికొండ:** హిల్ కాలనీ నుంచి పైలాన్ కు వెళ్లే ప్రధాన రహదారిలో అదేవిధంగా ముత్యాలమ్మ గుడి వద్ద కింది రోడ్డు వైపు వెళ్లే రహదారిలో రోడ్డు పక్కన వ్యర్థాలు పారబోయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దాంతో వాహనదారులు, ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కన చిన్న లోయలా ఉన్న ఖాళీ స్థలాలలో వ్యర్థాలు పారబోస్తూ ఉండటంతో వీధి కుక్కలు ఊర కుక్కలు వాటిని పెకిలించి ఈడ్చుకుంటూ రోడ్డు మీదకు తీసుకువస్తూ ఉండటంతో తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లేవారు వాహన దారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఆరు బయట స్థలాల్లో ఎక్కడ చెత్త వేయరాదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా కొందరు పెడచెవిన పెడుతున్నారనే విమర్శలున్నాయి అధికారులు రోడ్డు పక్కన వ్యర్థాలు పారబోయకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, బాటసారులు కోరుతున్నారు. చికెన్ మటన్ సెంటర్ల నిర్వాహకులు సైతం పలు వ్యర్థాలను రహదారుల పక్కన, బహిరంగ ప్రాంతాల్లో వదిలి వెళ్తున్నారు. వాటి నుంచి వస్తున్న దుర్గంధం, దుర్వాసనలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయాల్లో తెచ్చి రహదారుల పక్కన పారబోస్తున్నారు. వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసనను వెదజల్లుతున్నాయి. రహదారి వెంట వెళ్లే వాహనదారులు ఆ వ్యర్థాల నుంచి వస్తున్న కంపుకు ఆ దారి వెంట వెళ్లే వారు ముక్కులు మూసుకోవాల్సి వస్తుంది. ఓవైపు కొవిడ్ వ్యాప్తి కేసులు పెరుగుతూ ఉండటం వాటికి తోడువ్యర్థాలను విచ్చలవిడిగా రోడ్డు వెంట వదులుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలోని కార్పోరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ విద్యాసంస్థలు పునః ప్రారంభమైనా ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు అధ్వాన్నంగా ఉన్నాయని, పాఠశాలల్లో, వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సరికొండ రామకృష్ణంరాజు, కర్నాటి శివరామకృష్ణ, రామరాజుయాదవ్, నరేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బస్‌పాస్ ధరల పెంపు ప్రభుత్వం విరమించుకోవాలి

**ప్రజాపక్షం/దేవరకొండ;** బస్‌పాస్ ధరల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని బిఆర్‌ఎస్‌వి దేవకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బస్ పాస్ ధరలను పెంచి ప్రజలపై ప్రభుత్వం పెనుభారాన్ని మోపింది అని, విద్యార్థులపై తీవ్రంగా ఆర్థిక భారం పడుతుందనిఆయన ఆరోపించారు. అనేక రూట్లలో విద్యార్థుల కోసం బస్సులు నడపడం లేదని, ప్రజలను దోచుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అల వాటుపడింది అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఖనాజా నింపుకోవడానికి విద్యార్థులే దొరికారా అని ఆయన ప్రశ్నించారు.

## వివి. రామారావు మృతి బాధాకరం



**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పట్టణానికి చెందిన సినియర్ న్యాయవాది వివి రామారావు మృతి బాధాకరం అని బిఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని నాగోల్‌లో రామారావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామారావు అకాల మరణం తీరని లోటు అని, ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, సుధీర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

## నేడు 'బర్కతి' పుస్తకావిష్కరణ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మండలంలోని వట్టిమర్తి గ్రామ వాస్తవ్యులు డాక్టర్ సాగర్ల సత్తయ్య రచించిన బర్కతి కథా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు యుటిఎఫ్ భవన్ నల్లగొండలో ఉంటుందని సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ళ ఆనంద్, పుస్తకావిష్కరణ కార్యక్రమ సమన్వయకర్త బండారు శంకర్‌లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్తలైన డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి ,డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి,మేరెడ్డి యాదగిరి రెడ్డి,డాక్టర్ తండు కృష్ణ కౌండిన్యలు పాల్గొంటారని, కవులు , రచయితలు సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తం



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** వచ్చే వర్షకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. శనివారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా 13వ రోజు సూర్యాపేట పట్టణంలోని 13వ వార్డు గాంధీనగర్‌లో ప్రజలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షపు నీరు, మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలని, నీరు నిల్వ ఉన్నచో దోమలు వ్యాప్తిచెంది సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ ఇతరాత్ర వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, ఆ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పట్టణ ప్రజలు తడి,పోడి చెత్త ను వేరుచేసి ఇండ్ల ముందుకు వచ్చే మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని కోరారు. కూలిపోవడానికి సిద్ధం గా ఉన్న ఇళ్లలో ప్రజలు నివసించవద్దని, వేరే ప్రాంతాల్లో ఉండాలని, వర్షకాల సమీపిస్తున్నందున శిధిలంలో ఉన్న భవనాలు కూలిపోయే ప్రమాదం ఉంద ని అన్నారు. కూలిపోవడానికి సిద్దంగా ఉన్న భవనాల యాజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ సత్యారావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టిఎంసి శ్వేత, వార్డు అధికారి నరేష్, శివప్రసాద్, జవాన్ రఫీ, మ హిళ సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మీయతను పంచుతున్న ఆత్మీయట్రస్టు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** విప్లవ విద్యార్థి ఉద్యమ సంఘం పిడిఎస్‌యులో పనిచేసిన పూర్వ విద్యార్థి కార్యకర్తలు, నాయకులు ఇప్పుడు వ్యక్తిగత జీవితంలో కొనసాగుతూ ఉద్యమంలో పనిచేసి ఆరోగ్యానికి కూడా ఖర్చుపెట్టలేని స్థితిలో ఉన్న సహచరులకు ఒక ట్రస్టును ఏర్పాటు చేసి దాని ద్వారా అత్మీయతను పంచుతున్నటువంటి ఆత్మీయ ట్రస్టు చొరవ అభినందనీయమని ప్రజా వైద్యులు, తొలితరం పిడిఎస్ నాయకులు కొప్పుల రంగారెడ్డి అన్నారు. శనివారం పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ చిన్నతనంలోనే గుండెజబ్బును ఎదుర్కొని ఆరోగ్యం సహకరించక వ్యక్తిగత జీవితం కొనసాగిస్తూ అదే జబ్బుతో ఇటీవల మరణించిన వీరబోయిన లింగయ్య కుటుంబానికి ఆత్మీయట్రస్టు నుండి 20వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ విప్లవ విద్యార్థి ఉద్యమంలో పాల్గొని వ్యక్తిగత జీవితం కొనసాగిస్తూ ఆ చైతన్యాన్ని కొనసాగిస్తూ ఆ ఉద్యమంలో పనిచేసి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి అండగా ఉండటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయట్రస్టు ప్రతినిధులు రాయపూడి చిన్ని, ధర్మార్జున్, భద్రయ్య, డేవిడ్‌కుమార్, బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, అరుణోదయ వెంకన్న పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/కోదాడరూరల్:** చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం కోదాడ మండల పరిధిలోని దొరకుంట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బాతరాజు మైసయ్య (52) గేదెలు మేపేందుకు రోజు మాదిరిగా వెళ్లాడు. గేదెలను చెరువులో నీరు తాపిస్తున్న క్రమంలో వాటిని చెరువులో నుండి పైకి తీసుకరావడానికి మైసయ్య ప్రయత్నించే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మునిగిపోయాడు. పక్కనే గేదెలు కాస్తున్న మరో మహిళ నాగమణి చూసి తన కుమారుడు అంజికి ఫోన్ చేయగా అతను మరొక ఇద్దరు వ్యక్తులు వచ్చి చెరువులోకి దూకి అతనని బయటకు తీశారు. మైసయ్య అప్పటికే చనిపోయి ఉన్నాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

## బిజెపి మండల కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట బిజెపి మండల కమిటిని శనివారం ఎన్నుకున్నారు. బిజెపి చందంపేట మండల శాఖ అధ్యక్షులు గుంటోజు వినోదాచారి ఆధ్వర్యంలో మండల కమిటిని ఎన్నుకోగా బిజెవైఎం మండల అధ్యక్షులుగా చింతపల్లి అనిల్‌గౌడ్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా లింగాల శివకృష్ణ గౌడ్‌లు నియమితులయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీ అభివృద్ధి కృషి చేస్తామని వారు తెలిపారు. ఈసందర్భగా తమ నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



## రక్తదానంతో ప్రాణాలు కాపాడుదాం



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదాతలు ముందుకు వచ్చి ప్రాణదాతలుగా నిలవాలని స్వర్ణభారతి ట్రస్టు అధ్యక్షులు నీలా సత్యనారాయణ అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కోదాడ పట్టణంలోని స్థానిక తిరుమల హస్పటల్‌లో బ్లడ్ బ్యాంకులో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న వారు రక్తదానం చేయడంతో పాటు ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడిన వారమవుతామని, యువతి, యువకులు రక్తదానం చేసేందుకు తప్పక ముందుకు రావాలన్నారు. అనంతరం ఆపదలో ఉన్న వారికి అత్యధిక సార్లు రక్తం అందించి ప్రాణదాతలుగానిలిచిన షేక్ నజీర్, ఓరుగంటి కిట్టులను శాలువా, మెమెంటో, ప్రశాంసా ప్రతాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పైడిమర్రి వెంకటనారాయణ, చారుగండ్ల రాజశేఖర్, కాటేపల్లి నర్సింహరావు, పత్తి నరేందర్, వెంపటి వెంకటనారాయణ, రామ్మూర్తి పాల్గొన్నారు.



## మహిళలకు అండగా సఖి కేంద్రం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని సఖి కేంద్రాల ద్వారా బాధిత స్త్రీలకు అండగా నిలుస్తుందని సూర్యాపేట సఖి కేంద్రం కేస్ వర్కర్ పి.భవాని తెలిపారు. సూర్యాపేట మండల పరిధిలోని ఎండ్లపల్లి, రామారం, రత్నపురం గ్రామాల్లో శనివారం ఉపాధిహామీ కూలీలకు సఖి కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గృహహింస, వరకట్న, ప్రజలు పనిచేసే చోట లైంగిక వేధింపులు, ఆడపిల్లల అమ్మకం, ఆడపిల్లల అక్రమ రవాణా ఇతరుల నుండి సమస్యలు ఎదుర్కొనే అతివలు, బాలికలకు భరోసా కల్పిస్తున్నామని, వారికి కౌన్సిలింగ్ ఇస్తూ అవసరమైన వారికి పోలీసుల సేవలు, న్యాయపరమైన సేవలు ఉచితంగా అందిస్తూ కష్టాల కడిలి నుండి ఒడ్డుకు చేరుస్తున్నామని, మహిళలకు ఏకష్టం వచ్చినా హెల్ప్‌లైన్ నంబర్ 181 కాల్ చేసి సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

## అసంపూర్తి డ్రైనేజీ- రోడ్లపై మురుగునీరు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని రోడ్లపై మురుగునీరు పారుతుంది. కొద్దిపాటి వర్షం వచ్చినా మురుగు కాల్వలోని నీరంతా రోడ్లపైకి చేరుతుంది. అసంపూర్తిగా డ్రైనేజీ నిర్మాణ పనులు కావడం వల్ల ఈ సమస్య ఏర్పడింది. పట్టనంలోని సాగర్‌రోడ్డులో నిర్మాణమవుతున్న డ్రైనేజీ అసంపూర్తిగా ఉంది. కోదాడ జడ్చర్ల జాతీయ రహదారి వెంట సాగర్‌రోడ్డులో నిర్మించిన డ్రైనేజీ అసంపూర్తిగా ఉంది. నిర్మాణం పూర్తికాకముందే బస్టాండ్‌తో సహా మిగతా చోట్ల మురుగు కాల్వలు ప్రధాన డ్రైనేజీలో కలిపారు. దాంతో చిన్నపాటి వర్షం వచ్చినా మురుగునీరంతా వాసవీభవన్ రోడ్డులో నిలిచిపోతుంది. వాసవీభవన్ రోడ్డు వరకు నిర్మించిన డ్రైనేజీ వర్షపు నీటితో నిండి అక్కడి నుంచి రోడ్డు మీదకు చేరుతుంది. ఆ రోడ్లన్ని మురుగునీరు, చెత్తాచెదారంతో నిండాయి. రోడ్లపై దుర్వాసన వెదజల్లుతుంది. ఈ విషయంపై స్థానికులు మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ కూడా ఫలితం లేకుండాపోయింది. ఉన్నతాధికారులు దృష్టి సారించి డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

## బిసిలకు న్యాయమైన వాటా దక్కే వరకూ పోరాటం

**ప్రజాపక్షం/దేవరకొండ;** బీసీలకు న్యాయమైన వాట దక్కేంతవరకు పోరాటం కొనసాగుతుందని బిసి పొలిటికల్ జేఏసి రాష్ట్ర చైర్మన్ రాచాల యుగేందర్‌గౌడ్ అన్నారు. శనివారం దేవరకొండలో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీలు ప్రస్తుతం బీసీల ఓట్లను కొల్లగొట్టేందుకు స్థానిక సంస్థల్లో బీసీల ఓట్లతో సీట్లు పొందేందుకు బీసీ జపం చేస్తున్నాయని అన్నారు. బిసి గణన చేయాలంటే మాత్రం ఏ ఒక్క పార్టీ పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ బిసి కుల గణన ను చేసి పార్లమెంట్‌లో ఆమోదం తెలపాలని తధనానంతరమే ఎన్నికలు జరపాలని అన్నారు. త్వరలోనే ఉమ్మడి నల్గొండ జిల్లాలో 20వేల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సతీష్‌గౌడ్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు రవీంద్రచారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాఘవేందర్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, సాయిరాం, ఆంజనేయులు, హరీష్, సిద్దూ, లింగయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# వరకట్న వేధింపులతో యువతి ఆత్మహత్యాయత్నం

### స్పందించి ప్రాణాలు కాపాడిన సాగర్ పోలీసులు



**ప్రజాపక్షం/నందికొండ:** అత్తమామల వేధింపులు తళ లేక యువతి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన శనివారం నందికొండ మున్సి పాలిటీలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే నందికొండ ఎస్ఐ సంపత్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన జస్విత (28) భర్త, అత్తమామలు చాలా రోజులుగా తనను వరకట్నంతో వేధిస్తున్నారని ఆ వేధింపులు తాళలేక ఆమె ఆత్మహత్య చేసుకుని చనిపోదామని శనివారం తన కారులో ఒంటరిగా ఇంటి నుంచి బయలుదేరి మధ్యాహ్నం నాగార్జున సాగర్ చేరుకొని తనతో పాటు తెచ్చుకున్న విషాన్ని తాగి చివరి నిమి షంలో తమ తల్లిదండ్రులకు ఫోన్ చేయగా వారు కారులో తమ కుమార్తె అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించి ఆమె తండ్రి కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వగా వారు విజయపురి పోలీస్ ను అప్రమత్తం చేయడంతో వెంటనే ఎస్సై సంపత్ గౌడ్ తమ సిబ్బందితో కలసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తను పడి పోయి ఉన్న ప్రదేశాన్ని గుర్తించి వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా కమలా నెహ్రూ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఈలోపు ఆమె తల్లిదండ్రులు సాగర్ చేరుకొని మెరుగైన చికిత్స నిమిత్తం తమ కుమార్తెను హైదరాబాద్ తీసుకు వెళ్లడం జరిగిందని ఎస్సై తెలిపారు.సకాలంలో స్పందించి తన కూతురు ప్రాణాలు కాపా డిన విజయపురి టౌన్ పోలీస్ బృందానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్ట్ టీచర్ అంతిమయాత్రలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల కేంద్రానికి చెందిన ఆర్ట్ టీచర్ బోస్క సైదులు శుక్రవారం గుండెపోటుతో మరణించారు, కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ సైదులు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుమాలి కాంతా రెడ్డి,మాజీ సర్పంచి రెగట్టి రవీందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రావు ఎల్లా రెడ్డి, మాజీ ఎంపీటీసీ గంజి శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, ఎస్సి సెల్ జిల్లా వైస్ చైర్మన్ పుట్టల శ్రీను, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు తంగేళ్ల సత్తిరెడ్డి, ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు కొమ్ము వెంకన్న, మాజీ వార్డ్ మెంబర్ బొంగర్ల గిరి, ఎన్ ఎస్ యు ఐ లీడర్ బొంగర్ల వినోద్ పాల్గొన్నారు.



# పోలీస్‌శాఖకు కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గత మూడు రోజుల క్రితం కిడ్నాప్ కు గురైన 20 నెలల బాలుడి సంఘ టనలో తక్షణమే స్పందించి బాలుడిని కాపాడి తల్లితండ్రులకు అప్పగించినందుకు శనివారం నల్లగొం డ జిల్లా పోలీస్ కార్యాల యంలో బాలుడి తల్లిదండ్రులు గ్రామ పెద్దలు జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ నీ కలిసి పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# దాబాలు, హోటల్స్ వద్ద అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో హైవేల పక్కన ఉన్నటు వంటి హోటల్స్,దాబాలు, రెస్టా రెంట్ల నిర్వహకులు, యజమా నులు పోలీసు వారి సూచనలు, నిబంధనలు పాటించాలనీ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సూచిం చారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో యజమానులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎస్పి మాట్లాడుతూ ప్రతి హోటల్, దాబాలో కచ్చితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవా లని, ఏదైనా దొంగతనాలు, నేరాలు జరిగినప్పుడు నిందితు లను గుర్తించడంలో సీసీ కెమె రాలు ఎంతగానో ఉపయోగపడ తాయని సీసీ కెమెరాల ప్రాముఖ్య తను వివరించారు. అలాగే హోటల్స్, దాబాలు వద్ద వాహన దారులు ఆగే సమయంలో అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు హైవే పైన వాహనాలు నిలపకుండా, హోటల్స్ వద్ద సరైన పార్కింగ్ ఉండే విధంగా ఏర్పాటు చేసుకో వాలని, రాంగ్ రూట్ ప్రయాణ నియంత్రణకు సంబంధిత హోటల్స్ వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోని, వాహనదారులకు తగు సూచనలు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి, టూ టౌన్ సిఐ రాఘవరావు, ఎస్‌బి సీఐ రాము, యస్.ఐ సైదులు, హోటల్స్ యజమానులు తదిత రులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్‌రెడ్డికి ఎంపి చామల నివాళులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రిటైర్డ్ మండల విద్యాధికారి పాదూరి శ్రీనివాస్ రెడ్డి దశదిన కార్యక్రమం నల్లగొండ పట్టణం లోని చంద్రగిరి విల్లాస్‌లో నిర్వ హించారు.కార్యక్రమంలో భువ నగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని శ్రీనివాస్ రెడ్డి చిత్ర పటానికి పూలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరా మర్శించి ప్రగాఢ సంతాపం,సానుభూతిని వ్యక్తం చేసి మనోధర్యం నింపారు. ఈ కార్యక్రమంలో కుమారుడు శ్రీకాంత్ రెడ్డి, తెలంగాణ రిటైర్డ్ వార్డెన్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు పాదూరి ఇంద్ర సేన రెడ్డి, వాసుదేవ రెడ్డి, మహేందర్ రెడ్డి, గంట్ల వేణు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టైలరింగ్ శిక్షణ తరగతులు



**ప్రజా పక్షం/ నల్ల-గొండ టౌన్ :** మహి ళలు టైలరింగ్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసు కోనీ ఆర్థిక పురోగ తిని మెరుగుపరుచు కోవాలని మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య సూచించారు. యువ పరివర్తన ఫౌండేషన్ సహకారంతో శనివారం నల్లగొండ మండలంలోని గుండ్లపల్లి గ్రామం లో టైలరింగ్ శిక్షణ తరగతులు మాజీ జడ్పి టిసి లక్ష్మ య్య చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణ తరగతులను ప్రతి మహి ళ వినియోగించుకుని అభివృద్ధి చెందాలని అన్నారు. ఫౌండేషన్ ఏరియా మేనేజర్ మునేష్ మాట్లాడుతూ మహిళలకు టైలరింగ్ శిక్షణ వారికి స్వయం ఉపాధి కల్పిస్తుందని అలాగే ఫౌండేషన్ యువతకు మహిళలకు చక్కటి అవకాశాలు కల్పిస్తుందని తెలి పారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ,కావ్య శ్రీ ,అరుంధతి, శ్రీదేవి తదితర మహిళా సంఘాలు పాల్గొన్నారు.

# దశదిన కార్యక్రమానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** గుడిపల్లి మండల కేంద్రానికి చెందిన కోరే వెంక టేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల స్థితిగ తులు తెలుసుకొని దశదిన కార్యక్రమా నికి కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి 5000 రూపాయలు ఆర్థిక సహాయం శని వారం అందజేశారు.అదేవిధంగా బిఆ ర్ఎస్ మండల నాయకుడు, సిఎస్ ఫౌండేషన్ చైర్మన్ గోలిగిరి సైతం పార్టీ నాయకులతో కలిసి వెంకటేశ్వర్లు తోపాటు మరో మృతుడు శ్రీనయ్య కుటుంబాలను పరామర్శించి బియ్యం మరియు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎర్ర యాద గిరి,బిఆర్ఎస్ మండల నాయకుడు అర్వపల్లి నరసింహ, మండల బీసీ ప్రధాన కార్యదర్శి పోలె వెంకట్ యాదవ్,గోలి రవికుమార్,గణపురం సైదులు, బోడ నాగరాజు,కె.పి, ఈశ్వర్,శ్యామ్, రాంబాబు,వెంకట్,నాగరాజు,వంశీ ఉన్నారు.

# కెటిఆర్‌కు ఏసిబి నోటీసులు ఆక్షేపణీయం

**ప్రజాపక్షం/దేవరకొండ;** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసిబి మరోసారి నోటీసులు ఇవ్వడాన్ని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ తీవ్రంగా ఖండించారు. ఏసిబి అధికారులు గతంలో ఒకసారి కేటీఆర్‌ను సుధీర్ఘంగా విచారించి ఏమీ తేల్చలేకపోయిన సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ లో ఫార్ములా ఈ రేస్ నిర్వహించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నగరానికి ప్రత్యేక పేరు ఖ్యాతిలభించి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావడానికి దోహదపడిందని ఆయన గుర్తు చేశారు.

# మెగా లోక్‌అదాలత్‌లో 529 కేసులు పరిష్కారం




**ప్రజాపక్షం/ మధిర :** మధిర కోర్టులో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో 529 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఎన్.ప్రశాంతి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్ మధిర కోర్టు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి అధ్యక్షతన నిర్వహించారు. మధిర ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో 289 కేసులు పరిష్కారం కాగా రూ.1,32,900 జరిమానా విధించారు. అదేవిధంగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో 240 కేసులు పరిష్కారం కాగా రూ.3,86,800 జరిమానా విధిం చారు. ఈ సందర్భంగా క్రిమినల్ కేసుల్లో విధించే జరిమానాలో కొంత మొత్తాన్ని బాధితులకు అందచేసే విధంగా అవార్డులు తయారు చేసి బాధితులకు అంద చేయటం కొత్తవరవడిని సృష్టించించగా దీని వలన బాధి తులకు ఎంతో కొంత న్యాయం చేసినట్లు అవుతుందని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. సివిల్ జడ్జి ప్రశాంతి చేతుల మీదుగా అవార్డులు కాపీలు అందచేశారు. ఈకార్యక్రమంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఎం.అబ్రహం, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుల్లారావు, మధిర పట్టణ సిఐ రమేష్, ఎస్సై చంద్రశేఖర్, బ్యాంక్ అధికారులు, పోలీస్, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఆర్థికసాయం అందజేత



**ప్రజాపక్షం/కోదాడరూరల్:** కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామానికి చెందిన ఎల్ఐసి ఏజెంట్ మాధవరపు బ్రహ్మం గుండె సంబంధిత వ్యాధితో బాధప డుతూ వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో తోటి ఎల్ఐసి ఏజెంట్లు, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది కలిసి రూ.1లక్షా 45వేల రూపాయలను అందజేసి అండగా నిలిచారు. శనివారం కాపుగల్లు గ్రామంలోని బ్రహ్మం నివాసానికి లియాఫీ సంఘం అధ్యక్షులు కంజుల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సేకరించిన సొమ్మును అతనికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వట్టికూటి మల్లేష్, సొందుమియా, బ్రాంచ్ మేనేజర్ రమేష్‌రెడ్డి, ఏబిఎం రాము, కన్నయ్య, సైదా, ఏడుకొండలు, సుబ్రమణ్యం, రామారావు, వీరారెడ్డి పాల్గొన్నారు.

# పేదల పక్షాన పోరాడే ఏకైక పార్టీ సిపిఐ

## - సిపిఐ మండల మహాసభలో సాబీర్ పాషా



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : పేద ప్రజల పక్షాన పోరాడే ఏకైక కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని, వందేళ్ల చరిత్ర కలిగిన సిపిఐ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక అలుపెరగని పోరాటాలు చేసిందని భద్రాద్రి కొత్తగూడెం సిపిఐ జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా అన్నారు. సిపిఐ అశ్వారావుపేట మండల సమితి ఆధ్వర్యంలో శనివారం 16మండల మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల చరిత్ర ఉన్న పార్టీ బూర్జువ పార్టీలకు వ్యతిరేకంగా ప్రజా శ్రేయస్సు కోసం ఎన్నో ఉద్యమాలను చేసిన ఘనత సిపిఐకి ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్నాయని, వారికి త్వరలోనే గుణపాఠం చెబుతామని, దేశవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులు అందరూ ఏకమై కులమతబేధాలు లేకుండా ఎటువంటి వ్యత్యాసాలు చూడకుండా ప్రజాభీష్టం మేరకు ప్రజల కోసం పని చేసే ప్రభుతాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. ప్రజల ఓట్లతో నెగ్గిన ప్రభుత్వాలు వారి ప్రయోజనాల కోసం పనిచేయాలని, అలా కాకుండా ఈ ప్రభుత్వాలు ప్రజలను దోచుకునే విధంగా పనిచేస్తున్నా



యని అన్నారు. ముందుగా 49 సభ్యులతో కూడిన మండల కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అశ్వారావుపేట సిపిఐ మండల ఇన్‌చార్జిగా గన్నిన రామ కృష్ణ, మండల కార్యదర్శిగా వగెల అర్జున్‌రావును, సహాయ కార్యదర్శులుగా చిన్నయ్య, కోర్స తిరుపతిరావు, ముక్కంటిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం మాట్లాడుతూ మండల కార్యవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతిఒక్క సభ్యుడు మండలంలో పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేయాలన్నారు. మండల కార్యవర్గంలోని ప్రతిఒక్క సభ్యుడు సమయ స్ఫూర్తితో చురుకుగా పనిచేసి రాబోయే పంచాయతీ ఎన్నికల్లో వీలైనన్ని స్థానాల్లో గెలిచే విధంగా ప్రయత్నం చేయాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి నూకవరపు విజయకాంత్, డివిజన్ కమిటీ సభ్యులు జోగిరాజు, జాయింట్ సెక్రటరీలు సయ్యద్ జాకీర్, జక్కం బలరాం, ఎఐటీయూసి నాయకులు పటాన్ జలాల్, అనీల్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్, బ్యాంకుల ఆగడాలు అరికట్టాలి

ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంకుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచర్ల జమలయ్య, మునగడప వెంకటేశ్వర్లు అన్నారు. రామవరం ప్రాంతంలో ఏడు వార్డుల బాధితులు మేషన్ కాలనీ, ప్రశాంత్ నగర్ పంచాయతీ తదితర ప్రాంతాల్లోని మైక్రో ఫైనాన్స్ బాధితులు సిపిఐ నాయకుల చెంతన చేరి వారి కష్టాలను, ఫైనాన్స్ బ్యాంకులు పెట్టే ఇబ్బందులను వారికి వివరించారు. శనివారం రామవరం పాత పోస్ట్ ఆఫీస్ ఎరియా లో ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ బ్యాంకుల బాధితులతో సమావేశమై వారు మాట్లాడారు. ప్రైవేట్ బ్యాంకులో ఏజెంట్లు నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇచ్చి , లబ్ధిదారుల పై దాడులకు దిగటం చట్టరీత్య నేరమని అన్నారు. మహిళల యొక్క మానసిక స్థితిపై దౌర్జన్యాలు చేస్తున్నారని వారి యొక్క ఆగడాలను మానుకోకపోతే సిపిఐ ఆధ్వర్యంలో వారికి తగిన గుణపాఠం చెప్పవలసి ఉంటుందని హెచ్చరించారు. ఫైనాన్స్ నిబంధనలో ఉన్న ఇన్సూరెన్స్, వైద్యం మొదలైన సౌకర్యాలు ఉన్నాయని మాయ మాటలు చెప్పి పేద మధ్య తరగతి ప్రజలకు విచ్చలవిడిగా రుణాలు అందించి వారు కట్టలేని స్థితిలో వారిపై దౌర్జన్యానికి, గొడవలకు దిగటం సరికాదని హెచ్చరించారు. వర్షాకాలంలో పనులు దొరకక స్కూల్ పిల్లలు బుక్స్, ఫీజులు కట్టే సమయంలో వాళ్లు నాలుగు నెలలు గడువు అడుగుతున్నారు. తప్ప ఇచ్చిన అప్పును చెల్లించమని వారు చెప్పటం లేదని అన్నారు. తక్షణమే వారికి నాలుగు నెలల గడువు రుణాలు చెల్లించేందుకు అవకాశం



ఇవ్వాలని వారికి విజ్ఞప్తి చేశారు. ఏజెంట్లు ఒక వ్యక్తికి ఎన్ని రకాల లోన్లు ఇవ్వచ్చో లేదా ఎన్నైనా ఇవ్వచ్చా మరి నిబంధనలో లేదా అని పరిశీలించుకోకుండా రకరకాల లోన్లు బాధితులకు అందించి వాళ్లు రుణాలు చెల్లించలేని ఊబిలో నెట్టటం వారి కమిషన్ల కోసం కాదా అని ప్రశ్నించారు. తక్షణమే మైక్రో ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంకుల ఏజెంట్లు వారి పద్ధతులు మార్చుకొని చట్ట పరిధిలో వారి విధులను నిర్వహించాలని వారికి సూచించారు. ఎవరైనా ఏజెంట్లు మహిళలకు ఇబ్బంది కలిగిస్తే వెంటనే వందకు సమాచారం అందించి వారి నుండి రక్షణ పొందాలని బాధితులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తూముల శ్రీనివాస్, కనుకుంట్ల శ్రీనివాస్, జంజర్ల కృష్ణమూర్తి, సర్వ వీరభద్రం, మహిళా నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ బాధితులకు పరామర్శ

## సిపిఐ నియోజకవర్గ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన సాబీర్ పాషా



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేట పట్టణంలో రోడ్డు విస్తరణలో దుకాణాలను కోల్పోతున్న బాధితులను సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్.సాబీర్‌పాషా పరామర్శించారు. శనివారం పట్టణంలో జరగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. రోడ్డు విస్తరణలో భాగంగా తమ జీవనాధారం కోల్పోయిన చిరు వ్యాపారులకు ధైర్యం చెప్పారు. అధికారులు, పాలకులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని, చిరు వ్యాపారులను, పేదలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణ పనులు చేయాలని సాబీర్‌పాషా అధికారులను కోరారు. పెద్ద



పెద్ద బిల్డింగులు ఉన్న చోట ఒకలా, పేదలు, చిరు వ్యాపారుల షాపులు ఉన్న చోట ఒకలా రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారని ఆయన అన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, పేదలకు అన్యాయం జరిగితే సిపిఐ సహించే ప్రసక్తి లేదన్నారు. పేదలకు, చిరు వ్యాపారులకు న్యాయం చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన అన్నారు. అనంతరం అశ్వారావుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన సిపిఐ నియోజకవర్గ కార్యాలయాన్ని సాబీర్ పాషా ప్రారంభించారు. నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో సిపిఐ కార్యాలయం ఏర్పాటు చేయటం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండల నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కూనంనేని పుట్టినరోజు వేడుకలు



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పుట్టిన రోజు సందర్భంగా సింగరేణి కాంట్రా క్టు వర్కర్స్ యూనియన్‌ఏఐటీయుసి ఆధ్వర్యంలో శనివారం సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. కొత్తగూడెం కార్పొరేట్ లోని ప్రాజెక్టు ప్లానింగ్ కార్యాలయం వద్ద సింగరేణి సివిల్ విభాగం, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, ప్రైవేటు డ్రైవర్స్, ప్రాజెక్టు ప్లానింగ్ కాంట్రాక్ట్ కార్మికులు తమ ప్రియతమ నాయకుడు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారాని కై ప్రభుత్వంపై నిరంతరం పోరాటం చేస్తున్న కూనంనేని సాంబశివరావు జన్మదిన సందర్భంగా కాంట్రాక్టు కార్మికులు కేకును కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కేడబ్ల్యూ కృష్ణ ఫర్ నాయకులు ఎం.చంద్రశేఖర్, సిహెచ్ శ్రీను, కే.నరసింహ, వినోద, అనసూర్య, లక్ష్మి, ప్రవీణ్ మధు, లక్ష్మీనారాయణ, వంశీ, జగన్, సందీప్ కుమార్, సరిత, శేఖర్ రామారావు, సూపర్వైజర్స్ యూనియన్ తరపున కె.విజయ్ కృష్ణ, బి.మల్సూర్, రాము, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ఎసిబి నోటీసులు ఇవ్వడం చాలా దుర్మార్గం

ప్రజాపక్షం/జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలను అమలు చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని అడుగుతూ, ప్రశ్నిస్తూ, ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫార్ములా ఈ కార్ రేసు కేసులో మరో సారి ఏసీబీ నోటీసులు ఇవ్వడం చాలా దుర్మార్గమని వైరా నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లకావత్ గిరిబాబు అన్నారు. పరిపాలన చేతగాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరల్చడం కోసం డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టే విధంగా అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఎంతో అద్భుతంగా హైదరాబాద్ నగరంలో ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహించడం జరిగిందని, కానీ రేవంత్‌రెడ్డి సర్కార్ కక్షసాధింపు చర్యలు చేపడుతూ ఏదో రకంగా కేటీఆర్‌ను కేసులో ఇరికించాలని, ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నాడని, ఇలాంటి బెదిరింపు ధోరణులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. అభివృద్ధి చేసింది ఎవరో అవినీతి చేస్తున్నది ఎవరో తప్పకుండా వాస్తవాలు త్వరలో బయటికి వస్తాయని అన్నారు.

# ఘనంగా విప్లవకారుడు చేగువేరా జయంతి



ప్రజాపక్షం/జూలూరుపాడు: ప్రపంచ విప్లవకారుడు చేగువేరా యువతరానికి స్ఫూర్తి అని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు షేక్ సమీర్, వ్యవస్థాపకులు ఇడుపుల రాజు అన్నారు. సోమవారం చేగువేరా 97వ జయంతి కార్యక్రమాన్ని జెపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య వృత్తిలో, ఇంజనీరింగ్ విద్యలో పట్టా పుచ్చుకొని, బహు బాషలలో అనర్గలంగా మాట్లాడే ప్రావీణ్యం, రచయితగా, కవిగా రాణించిన వ్యక్తి చేగువేరా అన్నారు. ప్రజలను ఆర్థిక, రాజకీయ, సాంఘిక దోపిడీ నుండి విముక్తి కోసం, సామ్రాజ్యవాదాన్ని అంతమొందించాలని పోరాటం చేసిన గొప్ప విప్లవకారుడు అని వెల్లడించారు. జీవితాంతం ప్రజల కోసం జీవించిన మహానాయకుడు అని అన్నారు. ఈకార్యక్రమంలో మాడుగుల నాగరాజు, జర్నలిస్టులు తంబర్ల నరసింహారావు, కడియాల నాగేశ్వరరావు, బుచ్చిబాబు, మాడుగుల నరేష్, చరణ్, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర సర్వీస్‌లో వరప్రసాద్ ఉద్యోగం పొందడం హర్షణీయం




**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల పరిధిలోని మేకలతండా నివాసి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బానోత్ రామ్మూర్తి నాయక్ కుమారుడు బానోత్ లక్ష్మి వరప్రసాద్‌కు యూపిఎస్సీ సర్వీస్‌లో డిఎస్‌పి ఉద్యోగం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల, జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మేదరి టోనీ, గుగులోత్ భీముడు, మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, సురేందర్ మనియర్, దారావత్ భద్రు, బానోత్ రాంచందర్, ఆలోత్ ఈశ్వరి బాయి, గడ్డం వెంకన్న, మాళోత్ భావసింగ్, శకుంతల కిషోర్, పద్మావతి రాందాస్, గాంధీ, హర్ష, గమిడి నర్సింహారావు, కడియాల సుధాకర్, హనీఫ్, బానోత్ రాందాస్, కిలారి లక్ష్మి అప్పారావు, దారావత్ వినోద్ నాయక్, గౌస్, జానీ, షబ్బీర్, షేరు, షఫీ, తాజుద్దీన్, సట్టు వీరభద్రం, పాటి నర్సయ్య, తోటకూరి రాంబాబు, జగన్నదాం, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## రామాలయాన్ని అభివృద్ధి చేయండి



**ప్రజాపక్షం/కారేపల్లి:** కొత్తూరు తండా గ్రామంలో వెలసిన శ్రీ రాముని గుడి అభివృద్ధికి ప్రభుత్వం నుండి నిధులు కావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మేనల్లుడు కార్యాలయ ఇన్చార్జి తుంబూరి దయాకర్ రెడ్డినీ ఆలయ అర్చకులు బానోతు సురేష్, రవీందర్‌లు కలిసి మెమొరాండం ఇచ్చారు. ఈసందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం మెమొరాండం ఇవ్వడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, రుప్తా నాయక్‌లు పాల్గొన్నారు

## గ్రామంలో అరాచకాలను అరికట్టి శాంతి భద్రతలను కాపాడాలి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని భీమవరం గ్రామం రాజకీయాలకతీతంగా ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అభివృద్ధి పేరుతో అరాచకాలు సృష్టించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న వ్యక్తిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాక్‌రావు డిమాండ్ చేశారు. శనివారం భీమవరం బోడేపూడి భవన్ నందు జరిగిన సమావేశంలో ఆయనతో పాటు జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పరుస్తామని చెబుతూ ఒక వ్యక్తిగత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ఫెన్సింగ్ రాళ్లను, వైరును తొలగించి అక్రమంగా 190 సర్వే నెంబర్ భూమిలో దౌర్జన్యంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని అన్నారు. ఈ భూమి తనదే అంటూ గ్రామంలో వివాదాలు సృష్టిస్తున్నాడని, రైతుల పంటలకు నీటి వసతి కోసం లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన చెక్ డ్యామ్‌ను ధ్వంసం చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో తన రాజకీయ ఆధిపత్యం కోసం ప్రాకులాడుతూ అభివృద్ధి ముసుగులో గ్రామంలో వివాదాలు, అరాచకాలు సృష్టిస్తున్న వ్యక్తిపై సంబంధిత శాఖల అధికారులు స్పందించి చర్యలు చేపట్టి గ్రామంలో శాంతిభద్రతలు నెలకొల్పాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నల్లమోతు హన్మంతరావు, సగ్గుర్తి సంజీవరావు, నాగులవంచ వెంకట్రావయ్య, గొల్లపూడి చిన్నకోటేశ్వరరావు, గొల్లపూడి నారాయణ, దివ్వెల వీరాంజనేయులు, సామినేని మహేష్, మందడపు భాస్కర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## 'రైతునేస్తం' కార్యక్రమానికి ఏర్పాట్లు చేయండి

### - కలెక్టర్ జితేష్ వి పాటిల్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రేపు జరిగే రైతు నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖాముఖి మాట్లాడుతారని, ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు జిల్లాలోని 58 రైతు వేదికలను సర్వాంగ సుంధరంగా తీర్చిదిద్దాలని, మామిడితోరణాలు, రంగువల్లులతో అలంకరించాలన్నారు. సాయంత్రం 4 గం.కు ముఖ్యమంత్రి మాట్లాడుతారని, ఆడియో, విడియోలోపాలు లేకుండా ఖచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతు వేదిక వద్దకు రైతులు మధ్యాహ్నం 2 గం.లకే చేరుకునేలా తగినజాగ్రత్తలు తీసుకోవాలని, వారికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి మహిళా రైతులు కూడా పెద్ద ఎత్తున హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రతీ రైతు వేదిక పరిధిలోని రైతులకు సంబంధించి ఎంత మొత్తంలో రైతుభరతో అందుతుందో వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. మునగసాగు చేపట్టి లాభాలు గడించిన రైతులను ఆహ్వానించాలని, ఇంకుడు గుంతల నిర్మాణంలో దేశమొత్తం జిల్లా వైపు చూస్తోందని, దీనికి సహకరించిన ప్రతీ ఒక్కరినీ కలెక్టర్ అభినందించారు. రానున్న వర్షాకాలంలో నీరు నిలుస్తున్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.

## మున్నూరు కాపు కార్పొరేషన్ కోసం కృషి చేస్తా

### -రేణుకాచౌదరికి రుణపడి ఉంటా
### -టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు రేచర్ల బజార్‌లో ఏర్పాటు చేసిన మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావుకు ఘనంగా సన్మానం నిర్వహించారు. పిసిసి ప్రధాన కార్యదర్శిగా రాష్ట్రంలో కాపులకు ఒకే ఒక్క పదవి లభించిందని అదృష్టం నాకు దక్కటం కోంస ప్రయత్నం చేసిన కేంద్ర మాజీ మంత్రివర్యులు రేణుకాచౌదరికి ప్రత్యేకమైన ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుతున్నానని కట్ల రంగారావు అన్నారు. అదేవిధంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కి కూడా తనకు ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ ప్రభుత్వ పెద్దలు, కేంద్ర మాజీ మంత్రివర్యులు రేణుకాచౌదరి సహకారంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు కోసం కృషి చేస్తానని, పెద్దలు అందరితో కలిసి కార్పొరేషన్ ఏర్పాటు దిశగా నిరంతరం కృషి చేస్తానని కట్ల రంగారావు పేర్కొన్నారు. తన రాజకీయ జీవితం 35 సంవత్సరాల్లో నేను ఏ హోదాలో పనిచేసిన మున్నూరు కాపులు నా రాజకీయ జీవిత ఎదుగుదల్లో ఎతో కృషి చేశారని రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో మున్నూరు కాపులకు కూడా టిక్కెట్లు దక్కే విధంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా సోదరీమణులు పాల్గొన్నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, రేచర్ల నాగేశ్వరరావు, రేచర్ల రాముడు, కట్ల నాగరాజు, కామివెట్టి రవికుమార్, కట్ల సంతోష్, దాసరాజు కుటుంబరావు, యన్నం నాగేంద్రరావు, రేచర్ల పుల్లయ్య, వీరంశెట్టి సీతారాములు, మూల దుర్గాప్రసాద్, ముదిగొండ మహేష్, ఆది శ్రీకాంత్, అక్కిశెట్టి రవితేజ, మిట్టపల్లి సైదులు, దండ్యాల నర్సింహారావు, రేచర్ల అసత్యం, రేచర్ల వెంకటేష్, పుప్పాల అనంతరామయ్య, పుప్పాల సైదులు, పాలెపు సైదులు, రేచర్ల ప్రభాకర్, రేచర్ల రాము, శీలం ప్రభాకర్, కంభంపాటి సత్యనారాయణ, రేచర్ల కారు విశ్వనాధం, రేచర్ల సైదులు, రేచర్ల చిన్న విశ్వనాధం, ఆర్‌వి, రేచర్ల జనార్ధన్, నవీన్, రేచర్ల వెంకటేశ్వర్లు, కరెంటు రామారావు, పెద్ద ఎత్తున మున్నూరు కాపు మహిళలు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలి

### -ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన హెల్త్ డెరెక్టర్ రవీందర్ నాయక్





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామంలో ఉన్నటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా వైద్య సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్నటువంటి ఓపి రిజిస్టర్ను పరిశీలించి అభినందించారు. ల్యాబ్ రూమ్, మందుల గది, డెలివరీ రూమ్, ఓపి రూమ్, ఆసుపత్రి చుట్టూ పరిసర ప్రాంతాలు, టాయిలెట్స్‌లను పరిశీలించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మొక్కలను నాటి సంరక్షణ చేపట్టాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం మీటింగ్ హాల్‌లో హాస్పిటల్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలను తెలిపారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, కొత్తగూడెం డిప్యూటీ డిఎంహెచ్‌ఓ చైతన్య, ఎన్‌సిడి పిఓ మధువరన్, జిల్లా టీవీ ప్రోగ్రాం ఆఫీసర్ పుల్లారెడ్డి, మెడికల్ ఆఫీసర్ లక్ష్మీ సాహితి, ఆయుర్వేద వైద్యురాలు జయ, హెచ్‌ఈవో సోమ్లా నాయక్, హెచ్‌విలు రమణ, వెంకట నరసింహ, ఆసుపత్రి సిబ్బంది జితూ నాయక్, జై బాబు, సూపర్వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.